# సతీస్మృతి



రచన:

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

# సతీ స్మృతి

రచన:

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ప్రచురణ:
ఆగష్టు 1979

ప్రింటింగ్,
ఉదయా ఎంటర్‌ప్రైజెస్.

# అంకితం

ఆమె జననీ జనకులగు

వీరమాచనేని పున్నమ్మ, భూషయ్యగార్లకు -

# ముందు మాట

నాజీవిత యాత్రలో సహచరిణిగా ప్రయాణంచేసి,
అసువులు బాసిన నా అనుంగు అర్ధాంగిని గురించి
వృద్ధాప్యం వలన రాయలేకపోయినా,
మా అమ్మాయి కృష్ణచేత, రాయించాను.
ఇది కేవలం స్మృతిచిహ్నం.

దేవీనగర్
18-7-1979

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

# సతీ స్మృతి

"భార్యా బిడ్డలు తమ మిత్రులనే భావం పెంపొందినపుడు గృహ జీవితం స్వర్గతుల్య మవుతుంది."

నాకిప్పుడు 81 ఏళ్ళు. జీవితంలో ఎన్నో కష్ట సుఖా లనుభవించాను. దాంపత్య జీవితంగురించి అనేక గ్రంథాలు చదివాను. చాలా మందితో చర్చించాను.

పూర్వపు వర్ణాశ్రమ ధర్మాలు అంతరించినట్లే, వెనకటి భార్యా భర్త సంబంధాలు గతించాయి. అసలు 'భార్య', 'భర్త' అనేది బానిస సమాజానికి చెందింది. భర్త అంటే పోషించేవాడు, భార్య అంటే పోషింపబడేది. ఇది యజమాని, సేవక సంబంధం. మన పెద్దలదృష్టిలో ఆడది అంటే ఆటబొమ్మ, వంటలక్క, కాని మగవాడికి తోడునీడ కాదు. ఇవన్నీ బూజుపట్టిన భావాలు. మానవజాతి ఎంతో ముందడుగు వేసింది.

మనది ప్రజాస్వామ్యయుగం. వ్యక్తివికాసం దాని జీవలక్షణం. వ్యక్తివికాసాన్ని పెంపొందింప జేసేవి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అందరం ప్రాణప్రదంగా ఎంచుకుంటాం. ప్రజాస్వామ్య యుగంలో పుట్టి పెరిగి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఛాయలో వికాసం చెందిన ఇద్దరు వ్యక్తుల మధురమైన మైత్రీ బంధమే నేటికాలపు దాంపత్యం. దాంపత్యం అనేది బానిసత్వం కాదు, బాంధవ్యం, ప్రేమ, అనురాగాలు దాంపత్యానికి పునాది. అందుకే నవయుగ వైతాళికుడు గురజాడ గానంచేశాడు –

"మగువలకు మగవారి కొక్కటె
బ్రతుకు సుకరము,
ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును."

ఆదర్శజాతి అంటూ ఎలాలేదో ఆదర్శ దాంపత్యమంటూ కూడా లేదు. అన్నీ సాధనవలెనే నెరవేరునట్లే ఇదీను.

పూర్వం పురుషుడు తన దృష్టిలో స్మృతి, గ్రంథాలు అన్నీ రాశాడు. భార్య ఎలావుండాలో రాశాడుగాని భర్త ఎలావుండాలో రాయలేదు.

"కార్యేషు దాసీ, ...." ఈమాదిరి రాసుకుపోయాడు - ఆ గుణాలుగల పత్ని ఎక్కడైనా దొరుకుతుందా ?

స్త్రీకి విద్య, శిక్షణ ఏది - బోధ, బాధతప్ప ?

ఒంటిచక్రం బండి సర్కసులో మాత్రమే నడుస్తుంది. జీవితంలో కుదరదు. జీవితం రెండు చక్రాలబండి - స్త్రీ, పురుషుడు. ప్రతి పనిలోను యిద్దరు సహకరించుకుంటేనే నూతనబలం చేకూరుతుంది.

జీవితానికి సరైన సఖి లభ్యమవుతుందా అనేది ముఖ్యంకాదు. ఆమెకు నేను తగినవాడినేనా అని ఆలోచించుకోవాలి.

ఒకరి నొకరు చూచుకోవడం చాలదు. ఇద్దరూకలిసి ఏకోన్ముఖంగా చూడడమే ప్రేమ అనిపించుకొంటుంది.

వివాహమంటే విభిన్న వాతావరణంలో పెరిగిన వ్యక్తులు ఒకరినొకరు తెలుసుకుంటూ, అర్థం చేసుకుంటూ, ఒకరి అవసరాలు

మరొకరు మెలుకువతో గుర్తిస్తూ, పొరపులు లేకుండా స్వార్ధరహిత దృక్పథంతో ఒకరికోసం మరొకరు అన్నట్లు జీవితయాత్ర సాగించడం.

స్త్రీని అర్ధాంగిగా గాక అన్యాంగిగా భావించడంవల్లనే అనర్థాలు వస్తున్నవి.

కాలం గడిచినకొద్దీ అనురాగం వృద్ధి అవుతుంది. అది వయసు, అందం - అన్నిటినిమించి మనసును మనసులో ఏకం చేస్తుంది. అందుకు సహచర్యం, స్వార్థత్యాగం, ప్రయత్నం ముఖ్యం. వివాహానంతరం కొంతపొంగు తగ్గిన తర్వాతగాని యిది జరగదు. వయసు గడిచినకొద్దీ ఈ అనురాగలత వృద్ధిగాంచుతుంది.

పురుషునికి ప్రేమ జీవితంలో ఒకభాగం, స్త్రీకి ప్రేమే జీవితం.

జీవితానికి వెలుగు ప్రసాదించే దేవిగా స్త్రీని ఆరాధించాలి. అందుకు అనుగుణంగా ఆమె ప్రవర్తించాలి.

## ఇక మా సంగతి :

మా ఆవిడపేరు కుటుంబం. తలిదండ్రులు పెట్టినపేరు వెంకట కుటుంబ రంగనాంచారమ్మ. తర్వాత దానిని వెంకట కుటుంబము అని తానే మార్చుకున్నది. క్రమంగా 'కుటుంబం'గా మార్చుకుంది. ఈమె పుట్టిల్లు మా గ్రామానికి నాలుగు మైళ్ళలోవున్న లంకపల్లె. ఈమెకు ఒక సోదరుడు - లక్ష్మీనారాయణ, (ఇప్పటికీ వున్నాడు) సోదరి కాశీ అన్నపూర్ణ. ఈమె తండ్రి గ్రామ మునసబు వీరమాచనేని భూషయ్యగారు, తల్లి పున్నమ్మగారు.

మా పెళ్ళి నా 19 వ ఏట 10-6-1917 న జరిగింది. అప్పటికి ఆమె వయస్సు 14 సం॥ లు. 1918 లో కాపురానికి వచ్చింది.

మా ప్రథమ సంతానం సీతారామయ్య. పెండ్లయాక అతను గతించాడు. తర్వాత అతనిభార్య ద్వితీయం చేసుకోవడం సంతోషం.

1925 లో అమ్మాయి శకుంతల పుట్టింది. జాతీయవాదిని గనుక గుంటూరు శారదానికేతనంలో చదివించాను. అక్కడ సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ చదివింది. 27-3-1942 న ఆమె వివాహం బొందలపాటి శివరామకృష్ణతో వల్లభనేని సీతా మహ లక్ష్మమ్మ అధ్వర్యాన వర్జ్యం, వారం చూడకుండా జరిపించాను, ఇది ఆనాటి పరిస్థితుల ప్రభావం. వారికి శివాజి, సుజాత, రాంబాబు, కృష్ణ సంతానం మాఅల్లుడు శివరామకృష్ణ దేశికవితా మండలి అనే ప్రచురణసంస్థను స్థాపించి, నూతన పోకడలుపోయి, యశస్సు సంపాదించి, 45 ఏళ్ళ వయస్సుకే అస్తమించడం దురదృష్టం (20-6-65).

శకుంతల తర్వాత మాకు యిద్దరు మగపిల్లలు పుట్టిపోయారు. శకుంతలకు ఆడతోడు లేకుండా పోతుందని మా ఆవిడ దిగులుపడేది. స్త్రీకి సంతానాపేక్ష, పురుషునికి భోగాపేక్ష.

24-12-1934 న సుగుణ పుట్టింది. బి. ఏ. వరకు చదివింది. 1954 లో ఆమె వివాహం నిమ్మగడ్డ వెంకట రంగారావు (దొండ పాడు)తో జరిగింది. ఆయన హైదరాబాదులో లాయరు వారికి ఆనంద్ అనే కుమారుడు, 1958 లో మరొక మగశిశువును ప్రసవించి 3-12-58 న సుగుణ మమ్ములను దుఃఖంలోముంచి పోయింది. రెండు నెలలకు ఆశిశువు తల్లిని అనుగమించాడు.

సుగుణ తర్వాత మాకు 15-4-1936 న రాధాకృష్ణ పుట్టాడు. అతనికి వ్యవసాయంమీద అభిరుచి. గొట్టిపాటి వెంకటకృష్ణయ్య గారి (భట్ల పెనుమర్రు) కుమార్తె జయప్రదతో 1955 లో అతని వివాహం జరిగింది. వారికి మురళీకృష్ణ, రామకృష్ణ, సుగుణ సంతానం. మా కోడలువచ్చి అత్తగారి పుత్రికా దుఃఖాన్ని వుపశమింప చేయడం ఎంతో ఆనందించవలసిన విషయం.

## ఇక మా దాంపత్యం సంగతి

"పూర్వం మీగొడవలో, మీ చదువులో మీరుండేవారు. మీరు పలకరించడంలేదని బాధపడే దాననుకాను. ఒకప్పుడు పలకరించకపోతే బాధ. ఎప్పుడూ ఒకేమాదిరిగావుంటే బాధేముంది? ఇప్పుడు మీరు తరచు పలకరిస్తుంటే, వయసు మళ్ళినతర్వాత ప్రేమ కలుగుతుంది కాబోలను కుంటున్నా.

"అబ్బాయి కృష్ణకు చిన్నతనంలో తల మాదైనప్పుడు అతనితో నేను సతమతమవుతూండే దానిని. ఎప్పుడూ వాడిని చేతుల్లో పెట్టుకుని వుండేదాన్ని అప్పుడు మీరువచ్చి మీచేతుల్లోకి తీసుకుని అన్నంతిని రమ్మనేవారు. ఆ దృశ్యమే ఎప్పుడూనన్ను మీకు వశురాలిని చేస్తుంది. వాడి తలకురుపులుచూసి, ఆవయసులో మీరు నాకొరకు వాడిని ఎత్తుకోవడం నాకేగాక, చూసేవారందరికి కూడ అబ్బురంగా వుండేది. నాకష్ట సుఖాలపట్ల మీకుగల గాఢాభిమానం నేను జన్మలో మరవలేను.

"మీ అమ్మకూడా "ఎందుకే వాడింక బతికి బట్టకడతాడా, నువ్వెందుకు పథ్యపానాదులతో ఎండిపోతావు" అనేది. అప్పట్లో నాపథ్యం ఉసిరి పచ్చడి, మజ్జిగన్నం. దీనితోను, వాడిని కనిపెట్టుకు

వుండడంతోను శుష్కించిపోయాను". అన్నది మా ఆవిడ పాత సంగతులన్నీ గుర్తు చేసుకుంటూ.

"వాడిని నువ్వు బతికించుకున్నావు తల్లి ప్రేమతో. ఇప్పుడు నిన్ను నీకోడలూ, అబ్బాయీ బతికించుకున్నారు. నీ ప్రేమకంటే వాళ్ళ ప్రేమ గొప్పది" అని నేనంటే నవ్వుకున్నది. (ఆమెకు 1969 లో పెద్దజబ్బు చేసినపుడు వారు తమదగ్గరకు తీసుకువెళ్ళి నయం చేయించుకున్నారు.)

తల్లి బిడ్డను ప్రేమించడంకన్నా బిడ్డ తల్లిని ప్రేమించడమే గొప్పది. సంతానప్రేమ పశుప్రేమ.

"వడ్డించాను, భోజనానికిరండి" అనేదికాదు, "భోజనానికొస్తారా?" అనేది. ఇందులో ఆమె సంస్కారం కనబడుతుంది. అలాగే అమ్మాయి శకుంతలకూడా "నాన్నా, భోజనానికొస్తారా?" అంటుంది.

ఇటీవల అమ్మాయి మాటల సందర్భంలో, ఒకామె తనతో అన్నమాట చెప్పింది - "అమ్మాయి! మీ అమ్మతో బావగారెలా మాట్లాడతారో అలానాతో మీ బాబాయి మాట్లాడరుగదా" అని.

ప్రతిస్త్రీ తన భర్త ప్రేమ, ఆదరణ, ఆప్యాయత, పలకరింపు కోరుకుంటుంది.

మానవుడు కోరేది హృదయాన్ని, హృదయమిచ్చి హృదయం తీసుకోవాలి. అన్నిటికంటె మధురమైనది హృదయానుబంధం.

వయసుమళ్ళిన తర్వాత మేమిద్దరం అరమరికల్లేకుండా మాటాడు కునేవాళ్ళం....

ఒకరి కష్టసుఖాలు మరొకరం గ్రహించ ప్రయత్నించాం.

ఈకాలంలోనే నిజమైన జీవితం జీవించామనుకున్నాం.

నేను తనను ఏమీ కష్టపెట్టలేదనీ, తూలనాడలేదనీ అనేది మా ఆవిడ.

పడుచుతనంలో నాకేమైనా కోపంవచ్చినా పళ్ళెంవిడిచి వెళ్ళి పోయేవాడినేగాని, మరేమీ అనేవాడిని కాదనేది. 'అది సత్యాగ్రహం కాదు, దురాగ్రహం' అనిపిస్తుందిప్పుడు.

మా అమ్మాయిలు నాదగ్గిరకూచుని అవీ యివీ మాటాడేవారు గాని అబ్బాయి ఎప్పుడూ దగ్గరకొచ్చేవాడుకాదు - వెళ్ళేటప్పుడు 'వెళ్ళొస్తానానాన్నా' అనడం తప్ప.

"మీనాన్న ఏమన్నా పెద్దపులా? దగ్గరకుపోయి మాట్లాడు" అనేదామె.

"మానాన్నమీద గౌరవంతోనే, మాట్లాడనమ్మా" అనేవాడబ్బాయి. కాని చిన్నప్పటినుండి దగ్గర కూచోబెట్టుకుని మాట్లాడించకపోవడం నాదే పొరపాటు.

మమ్ములను వీడిపోయిన మా మరదలు కానూరి కాశీ అన్నపూర్ణ తాలూకు భూమి అమ్మి, మాయింటావిడ పేరనే రాయించాను. దాని తాలూకు జమ, ఖర్చురాసి ఆమొత్తం ఆమె కివ్వబోయా.

"సంసారంలో 'నీది' 'నాది' అనుకుంటే సంసారం ఎలా సాగుతుంది? చాలు చాల్లెండి, నాకక్కర్లేదు" అన్నదామె.

ఆమె మామూలుగానే తన సహజ ధోరణిలో అన్నది. కాని ఆలోచిస్తే అది సత్యమని తోస్తుంది. ఇలాకాకుండా వేరే వేరే చిట్టాలు పెట్టుకున్నవారు తగాదాలు పడడంచూస్తున్నాం.

స్త్రీ యుగ యుగాలనుండి అనేకబాధలు పడుతున్నది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత స్త్రీల సమానహక్కులు, బాధ్యతలు గురించిన ఆలోచనా ధోరణుల్లో మాత్రం బాగా మార్పువచ్చింది. స్త్రీల కష్టనివారణకు దారి సుగమం అవుతోందిప్పుడు. కాని స్త్రీ పురుష సంబంధాలలో యిది చాలా కలవరానికి కారణం అయింది.

దంపతులెప్పుడూ "ఇదినాది" అనికాక "మనది" అనుకోవడం వలన దాంపత్యజీవితం సుఖమయం అవుతుంది.

ఒకసారి మా ఆవిడతో "నీసొమ్ము నాకింద చాలాపడింది. నేను ముసలివాడనయాను, ఎవరు ముందో ఏమో, కొంతడబ్బు నీకిస్తా, వుంచుకో మంటే "మీరున్నంతవరకు అక్కర్లేదుగదా? మరి మీరేలేనపుడు ఈడబ్బు కాపాడుతుందా?'' అన్నది.

పురుషుడు పోయినతర్వాత స్త్రీది బానిసబతుకు. సంఘంలోను, కుటుంబంలోను ఆమె అభాగిని. వార్ధక్యంలో స్త్రీలేని పురుషుని జీవితమూ దుర్భరమే.

ఆమె ఎప్పుడు ఎంతపైకం కావాలంటే అంత ఇస్తూవుండే వాడిని. గ్రామాంతరం వెళుతూన్నపుడు 'ఎంత కావాల'ని అడిగితే 'ఇరవై' అనేది 'ముప్ఫయి తీసుకో, అవసరం వస్తుందేమో' నంటే, 'వద్దండీ, ఎంత చేతిలోవుంటే అంతా ఖర్చవుతుంది' అని తీసుకునేది కాదు.

భార్య అడిగినపుడు యివ్వకపోతే ఆమె ఇంట్లో ధాన్యమో, అపరాలో దిగబోస్తుంది. ఆమె అడిగినపుడు యివ్వకపోవడం ఏం న్యాయం? భార్యను అర్థాంగిగా గాక పరాయిమనిషిగా భావించి నట్లవుతుంది.

అసలు దంపతులలో అనురాగముంటే ఆర్థిక తగాయిదాలు రానేరావు. అది లేనపుడు అన్నీ తగాదాలే.

ఒకసారి మా పాలేరువచ్చి 'మనబండి విరిగిపోయిందండీ' అన్నాడు. 'ఎలా విరిగిందిరా ?' అని నేనడుగుతూంటే, కన్నతల్లి వచ్చి 'అబ్బాయికి దెబ్బ తగల్లేదుకదా' ? అన్నది నాకు మాత్రం కుమారుని మీద ప్రేమ లేదా ? కాని తల్లికి తండ్రికి గల తారతమ్య మదే. తల్లిప్రాణం అలా అనిపించింది.

'Woman" the world of love, of emotion, of sympathy.

నేను ప్రతిదీ స్త్రీతో సంప్రదించడమే కాదు, ఆమె మాట మన్నించేవాడిని. మరీ ముసలివాళ్ళమైన తర్వాత ఆమెలోని మాధుర్యాన్ని గ్రహిస్తూవచ్చాను.

వయసులో శరీరాల కలయిక - అది మోహం.

ఒకరి సుఖానికై మరొకరు త్యాగంచేయడం, ఒకరికొకరు తోడ్పడడం - ఇదీప్రేమ, పరస్పరం వీడలేని అనుబంధం.

వృద్ధులమైన తర్వాత మిత్రులవలె కలిసిమెలిసి సంభాషించు కునే వాళ్ళం.

మాటల సందర్భంలో "మళ్ళా జన్మలోకూడా మీరే నాకు భర్త కావాల"ని అన్నదామె.

ఇది నాగొప్పతనానికి చెప్పుకోవడంలేదు. ఇంత చదువు చదివి, ఇందరి పెద్దలసన్నిధిలో మెలిగిన నేను చప్పున 'నాకూ అదే కోరిక' అని అనలేక పోయినందుకు విచారిస్తున్నా. ఎంతకాలానికో ఆమాట ఆమెతో అన్నా. 'విప్రాత్ పశ్చిమ బుద్ధయః' అన్నారు గదా ! చదువు వేరు, సంస్కారం వేరు.

ఒకసారి నేను వూరుపెళ్ళి తిరిగొచ్చాక "మనుమడు ఆనంద్ 'అమ్మా, నిన్ను తాత ఏమీఅనడేమే?' అని అడిగాడండీ. వీడికి ఆమాట ఎందుకుతట్టిందో" నన్నది ఆవిడ.

"నేను వార్ధక్యంలో నీకు లొంగిపోయానుగదా" అన్నాను.

"వార్ధక్యంలో ఏమిటండీ, మీరెప్పుడో లొంగిపోయా"రన్నది.

దాంపత్యంలో, జీవితంలో సరసం, పరిహాసం లేకపోతే ఏమున్నది ఆనందం!

'సానితోగాని సరసాలు, పెళ్ళాంతోనా?' అనేది పాతమాట.

ఒకసారి మేమిద్దరం మా అమ్మాయి శకుంతలగారింట వుండగా నూతన దంపతులు వచ్చారు.

'మీరిద్దరు అన్యోన్యంగా వుంటున్నారా? అదిగో మా ఆవిడ ఆమెనడగండి, మేమెంత కలిసిమెలిసి వుంటున్నామో' నన్నా.

"ఆఁ, ఇప్పుడుంటున్నాం లెండి-కలిసి మెలిసి" అన్నదామె.

'కావలసింది ఇప్పుడే - వయసులో ఎలా వున్నా ఫర్వాలేదు' అన్నా.

వయసు, మనసు పెరిగిన తర్వాతనేగదా జీవితం!

మిత్రుడు కలదిండి నారాయణరాజుగారు ఒకసారి, అవ్వగారూ, తాతగారు అందరకు మంచివారు, మీకూనా? అని అడిగితే 'నాయనా, వారిని దగ్గరపెట్టుకునా? అడగడం?' అని చమత్కరించిందామె. ఇటువంటి చమత్కారాలు లేకపోతే జీవితం శుష్కం, శూన్యం అయిపోతుంది.

'నిజం చెప్పు, వయసులో నిన్నేమైనా అన్నానా ?' అని అడిగానొకసారి,

'అసలు మన ఇంట్లో ఒకరినొకరు చెడుగా అనుకోవడం అనేది ఎప్పుడూ లేనే లేదు. నే నెప్పుడు పడితే అప్పుడు పుట్టింటికి వెళ్ళేదాన్ని, ఏమిచేసినా మీ రేమీ అనేవారు కారు.

"నన్నేకాదు, శకుంతల చదువుమానేశాక కమ్యూనిస్టు స్త్రీలతో కలిసి మహిళా సంఘాల్లో పనిచేసినపుడు కూడ మీరేమీ అనలా' అన్నది.

ఒకసారి వేమూరి జగపతిభార్య శ్రీకృష్ణ ఆమెతో మాట్లాడుతూండగా వెళ్ళి, 'ఇతరులున్నపుడైనా నేనొస్తే నుంచుని మర్యాద చెయ్యొద్దా' అన్నా 'ఆమె పరాయిదికాదు గదండి. మనుమరాలేగా?' అన్నది ఆలోచించకుండానే, ఆమె సమయస్ఫూర్తికి ముచ్చటపడ్డా.

ఇటువంటి మధురస్మృతు లెన్నోవున్నాయి జీవితంలో.

గృహసంబంధమైన విషయాలలో స్త్రీలు నేర్పరులు. అందులో వారి మాట వినడం మంచిదని నా అనుభవం.

త్రిపురనేని గోపీచంద్‌గారుకూడా మాటల సందర్భంలో ఒకసారి యిదే అభిప్రాయాన్ని వెల్లడించారు.

మా అబ్బాయి మితభాషి. అందరితో కలవలేడు. నేనూ మొదట అలాగే, వుండేవాడిని.

అతనొకసారి వుత్తరంలో 'అమ్మ ఆరోగ్యం ఎలావున్నది? కులాసాలాగావున్నదా ?' అని రాసిన భాగాన్ని చదువుతూంటే వాళ్ళమ్మ 'వాడిని ఇప్పుడు కన్నట్లుందని' ఉప్పొంగి పోయిండి. మనసులో ప్రేమవుంటేచాలదు దానిని వెల్లడించితేనే ఆనందం.

ఇది గుర్తెరిగే నేను ఆనందింపజేసి ఆనందిస్తున్నా - ఇంటా, బయటా !

ఇదివరకు నా రచనలన్ని మా అల్లుడే అచ్చువేసుకునేవాడు. అతను లేడిప్పుడు. 'ఘంటసాల చరిత్ర' రెండవ ముద్రణవేయుడం సమస్యయింది,

ఈ సంగతి కనిపెట్టిన నాసతి 'ఆలోచిస్తారెందుకు, వారిని వీరిని అడుగుతారా ? ఒక ఎకరం అమ్మి అచ్చు వేయించండి' అంది.

ఈ కారణాలన్నిటినిబట్టి ఆమె సంస్కారం ఆత్మగౌరవం గలదని, నాకు తోడునీడగా నిలిచిందని ఆనందిస్తున్నా.

స్త్రీని కాదని ఏం చేయుగలం ? సాధింపులు ఎటువంటివారికి తప్పవు. 'ఇంటిలోనిపోరు ఇంతింత గాదయా' అన్నాడు వేమన.

అనుకూలవతి, వివేకవతి అర్ధాంగి అయితే ఎంత ఆనందం ! ఎంత గౌరవం !

మాఆవిడ ఆరోగ్యం అంతంతమాత్రం-అయినా నేను సభలకో, సమావేశాలకో, మిత్ర సందర్శనానికో తరుచు గ్రామాంతరం వెళ్ళే వాడిని.

"నిన్ను యీ వయసులో, అనారోగ్యంలో విడచివెళ్ళి నీపట్ల మహాపరాధమే చేస్తున్నా" ననేవాడిని.

అలవాటైనప్రాణం ఈ ఒక్కసారి అందర్ని చూసివచ్చి యిక యింటిపట్టునే వుండా లనుకునేవాడిని, కాని వుండలేక పోయే వాడిని.

"ఫర్వాలేదు. ఈజబ్బు రోజూవుండేదే, ప్రాణం తీసేదికాదు. నేను అలవాటుపడిపోయా. మీరెక్కడుంటే ఏమండీ, మీలాంటి భర్త దొరకడం నా అదృష్టం" అనేదా యిల్లాలు.

గాంధీమహాత్ముడన్నమాట గుర్తొచ్చింది.

"నేను భర్తగా కస్తూరిబాయిపై అధికారం చేసినంతవరకు ఆమె హృదయంలో నాకు ప్రవేశం కలగలేదు. నా అధికారాన్ని వదులుకుని అస్త్రసన్యాసం చేసిన పిమ్మట ఆమె హృదయంలో నిగూఢమైన అమృతభాండం నాకు గోచరించింది !"

ఈమాట కలకాలం ఎల్లరూ మననం చేసుకోవలసినది.

East and west
Home is best

సకల ప్రపంచంలోను గృహస్థాశ్రమమే శ్రేష్ఠం.

పైదంతా 'మిత్రులూ - నేనూ' గ్రంథంలో 1970 లో రాసింది అనుసరించి రాశాను.

గాంధీగారి స్వాతంత్రోద్యమ సమరంలో స్త్రీలుకూడ ముందంజ వేసి కాంగ్రెసు ప్రచారంలోను, పికెటింగుల్లోను పాల్గొనేవారు. కృష్ణా జిల్లాలో వల్లభనేని సీతామహలక్ష్మమ్మ, దిగుమర్తి జానకమ్మ మొదలైనవారు చురుకైనపాత్ర నిర్వహించారు. సీతామహలక్ష్మమ్మ గారి ఆధ్వర్యాన మా వూరిలో గొర్రెపాటి సరస్వతమ్మ, గొర్రెపాటి కుటుంబం, గొర్రెపాటి లక్ష్మీకాంతం, దోనేపూడి బాలమ్మగార్లు బయలుదేరి దివి తాలూకాలోని పెక్కు గ్రామాల్లో కాంగ్రెసు ప్రచారం చేశారు. మావూరి గొర్రెపాటి చిన్న నరసింహంగారు బండి కట్టించి వీరందరినీ వూరూరు తీసుకువెళ్ళాడు.

ఆ తర్వాత మావూరి కల్లుదుకాణంవద్ద పికెటింగు ప్రారంభించారీ మహిళలు. 29-3-1933న వీరిని అరెస్టుచేశారు. బాలమ్మగారు మావూరి మున్సబు లక్ష్మయ్యగారమ్మాయి అవడం వలన ఆమెని వదిలి, సరస్వతమ్మ, కుటుంబమ్మ, లక్ష్మీకాంతంగార్లకు 3 నెలలు శిక్ష విధించి, నూజివీడు సబ్ జైల్లో వుంచారు. తండ్రినిబట్టి తనని అరెస్టు చేయనందుకు బాలమ్మగారు చాలా బాధపడేది. కుటుంబం, సరస్వతమ్మ, బాలమ్మ గాఢమిత్రులు.

మా ఆవిడ ఇంట్లో వస్తువులన్నీ పొందికగా అమర్చుకునేది. శుభ్రత ఎక్కువ పాటించేది. ఇంటికవసరమైన వస్తువులన్నీ సూది మొదలు గంగాళంవరకు ఏకొరతరాకుండా జాగ్రత్త చేసుకునేది. రోజువారీ వంటదగ్గర్నుండి ప్రతి దానిలోను చాలా ఒబ్బిడిగా వుండేది. కోడలు కూరలుకోస్తుంటే, 'పాపా, కూరలు కోసేటప్పుడు నాలుగు కూరగాయలు ఒకబుట్టలో వేస్తూండు. వేళగానివేళ అతిథి ఒస్తే కూరవెతుక్కునే పనివుండదు' అని చెప్పేది.

జమఖర్చు చాలా జాగ్రత్తగా రాసుకునేదావిడ. ఆపుస్తకాలన్నీ యిప్పటికీ వున్నాయి. ఆమె పోయాక, భోషాణంలో తాళం వేసివున్న చిన్న పెట్టె అందరి ఎదురుగా తీయించిందమ్మాయి. ఎంతడబ్బున్నదో వివరంగా చీటీరాయించి మరీ వుంచిందందులో మా ఆవిడ. అంత కరెక్టుగా, శిక్షణగా వుండేదామె.

ఆధ్యాత్మిక విషయాల్లో దానధర్మాలగురించి మాత్రం ఏమీ వెనకాడేదిగాదు. 1977 లో తన ఒంట్లో బాగుండని స్థితిలో కూడ మావూరి 'ఆధ్యాత్మిక జ్ఞాన సమాజం' మందిరం ప్రారంభోత్సవ సమయంలో కుటుంబ సమేతంగా ఘంటశాలవెళ్ళి రు. 500/- విరాళమిచ్చింది. ఆమె వెళ్తున్నపుడు వియ్యపురాలు గజేంద్రమ్మగారు

రు. 116/-, ఆమె పెద్దకుమార్తె దుర్గాంబ రు. 116/- లు విరాళ మిచ్చారు.

ఒకసారి తాతినేని వెంకటసుబ్బమ్మ (కోడలి మేనమామ భార్య) ఘంటశాల వచ్చినపుడు "మీ చిన్న మనుమడు తాతగారి లాగే కవి అవుతాడండీ" అంటే మా ఆవిడ 'అయ్యో, అదిమాత్రం ఒద్దండి' అంది నవ్వుతూ. కవులు, రచయితలు వాళ్ళ గొడవలో వాళ్ళుండి సంసారం పట్టించుకోరని ఆవిడ అనుభవం.

ఒకసారి మామనుమడు మురళి ఘంటశాలవచ్చి, ఎండలో తిరిగివెళ్ళాడు విజయవాడ. చిన్నవాడు ఎండలో ఎలావెళ్ళాడోననే బాధకొద్దీ నేను విజయవాడ ఫోన్ చేసేందుకు పోస్టాఫీసుకి వెళ్ళా. 'పిల్లవాడు ఎందుకు వెళ్ళలేడండీ, ఎండలో మీరెందుకు మళ్ళా పోస్టాఫీసుదాకా వెళ్ళడం?' అని వారించింది. నాపట్ల ఆమె అభి మానం అలాంటిది. నాబాధ మనుమడిగురించి, ఆమెబాధ తన పెనిమిటిగురించి.

వృద్ధాప్యంలో వ్యవసాయం చేయించడం సాధ్యంకాక పొలం పుట్రా అమ్మేసి బళ్ళారిదగ్గర దేవీనగరంలోవున్న అబ్బాయికిచ్చాను. 1971 లో 'ఇల్లుకూడా అమ్మేసి ఇస్తా'నంటే 'అది అనందుకుంచండి నాన్నా' అన్నాడు.

'మంచిపని చేశార'న్నది మా ఆవిడ.

మా ఆవిడని ఎప్పుడూ పేరుపెట్టి పిలవలేదు. పాతకాలపు వాడినిగదా? 'ఒసేయ్' అనికూడా అనలేదన్నాడూ.

1971 నుండి 76 వరకు ఏడాదికొకసారి మాయిద్దర్నీ ఘంట శాలనుండి అమ్మాయి దేవీనగర్‌లో దింపివెళ్ళేది. కొంతకాలమయాక మళ్ళా ఒచ్చి ఘంటశాల తీసుకెళ్ళేది.

1976 లో మా ఆవిడకు వ్యాధి ముదిరినపుడు అమ్మాయి, అబ్బాయి బెంగుళూరు తీసుకెళ్ళి నయం చేయించుకొచ్చారు. అప్పటినుండి మేం దేవీనగర్‌లోనే వుంటున్నాం.

మారుతున్న విలువలదృష్ట్యా, ముసలివారి విషయంలో పిన్నలు శ్రద్ధతీసుకునే సమయంకాదిది. కాని కృష్ణ, ఇతరమిత్రులు తరుచు అంటున్నట్లు మా అబ్బాయి, కోడలు అపరూపమైన వ్యక్తులే. మాకు ముసలితనపు ఇబ్బందులేమీ లేకుండా మాగదికి జోడించి స్నానాలగది, దొడ్డి కట్టించారు. మా ఆహార పానీయాల విషయంలో ఏలోటు రానీకుండా ఎంతో శ్రద్ధగాచూస్తారు. మా కోడలు ఎంతపనిలోవున్నా, వేళకు మాపనులు మాత్రం చక్కగా నిర్వర్తిస్తుంది. 'కోడలేమిటి, మనుమలు, మనుమరాలుకూడా అంత జాగ్రత్తగా మీపనులు చేస్తారేమిటి నాన్నా, చిన్న పిల్లలైనా, విసుక్కోకుండా?' అని ఆశ్చర్యపోతుంది కృష్ణ. మా మనుమరాలు సుగుణ కాలేజిలేని సమయంలో మాక్కావలసినవన్నీ సమకూర్చి పెడుతుంది.

ఘంటశాలలో మాయింట ముప్పై ఆరేళ్ళు పనిచేసినసరస్వతి మా ఆవిడని 'అక్కయ్యా' అని పిల్చేది. విజయ అనే పనిమనిషి 'మామ్మా' అని పిల్చేది పల్లెల్లో కుల, వర్గ విచక్షణలేకుండా చుట్టరికం మాటల్లో కలుపుకోవడం వుండేది. బంధువులను ఆదరంతోచూచేది, అందు నా మాతృవిహీన అయిన మేనకోడలు శ్రీలక్ష్మిని మరీను. మా ఆవిడ పనిమనుషులనుగాని, యిరుగు పొరుగునుగాని ఏనాడు తూలనాడగా ఎవరూ ఎరగరు. పోట్లాటలకు చాలా దూరమామె. అయితే మంచి పట్టుదల గల మనిషి. Calm & Silent worker.

జీవితాంతం ఖద్దరుబట్టలే కట్టింది. తను చనిపోయినప్పుడు కట్టేందుకుఒక కొత్తచీర వేరేగా వుంచింది.

అవసానదశలో ఆమెని చూసేందుకు ఘంటశాల నుండి గొ్రె పాటి బావనయ్య, ఆ నుసతి మహాలక్ష్మమ్మ, వేమూరి సుగుణ వచ్చారు. వారిని గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించింది.

ఎప్పుడైనా ఆమెకి కోపం వచ్చినపుడు 'మీకు పుస్తకాలు రాయడం తప్ప యింకేమీ తెలీదు'అని విసుక్కునేది, పోనీ ఆఒక్క కితాబు అయినా నాకిచ్చిందని నవ్వుకునేవాడిని.

1958లో సుగుణ పోయినపుడు 'నన్ను మీబిడ్డగా భావించండి నాన్నా, అని కృష్ణాబాయి నాకు చేరువయింది. ఇంట్లో అందరు కూడ ఆమెను సన్నిహితురాలుగా భావిస్తారు. 1967 లో కృష్ణ మా యింటికొస్తే 'మీ నాన్న మీద బెంగగా వుందామ్మా? ఏముందీ కార్డు ముక్క రాశావంటే నీదగ్గరవాలతారు' అంది మా ఆవిడ ఛలోక్తిగా.

1969 లో ఈవిడకు జబ్బు చేసినపుడు శకుంతల ఇంటికి కృష్ణ ఒస్తే 'ఇద్దరూకలిసి నన్ను బైట పారెయ్యండే అమ్మా' అన్నది.

తల్లిలేనిబిడ్డ ఆనంద్ పెళ్ళిగురించి ఆమెకి చింతవుండేది. ఆ బాధ్యత అబ్బాయి తీసుకుంటాడులే. నువ్వు బెంగపడకు' అని ఓదార్చేవాడిని. ఆవిధంగా ఆమె స్థిమితపడింది.

'మీరుండగానే అబ్బాయి చేతులమీదగాపోవాలనుంది'. ఆమె కోరిక నెరవేరింది. కాని నాకు బాధమిగిలింది. నేను ముందుపోయి వుంటే ఆమె పడవలసిన బాధనుండి విముక్తురాలయిందని మాత్రం తృప్తి.

చనిపోయేముందు తన పక్కనే వున్న అబ్బాయివి, కోడలి చేతులు తీసుకుని తన చెంపలకు రాసుకుంది. 1979లో ఫిబ్రవరి 22 న

ఉదయం 9 గంటలకు ఆమె కన్నుమూసింది. 62 సంవత్సరాలు నాకు సహచరిణిగావుండి. వెళ్ళిపోయింది.

శకుంతల వచ్చేవరకు రెండు రోజులుంచి, 23 న సాయంత్రం 5 గంటలకు కర్మకాండ జరిపాడు అబ్బాయి, చాలా నిష్ఠగా. అలా, ఆమె అనుకున్నట్టే అంతా జరిగింది.

ఆమె కిష్టమైన పొలాన, దహన సంస్కారాలుచేసి తులసికోట కట్టించాడు. ఆనాడు మా వియ్యపురాలు గజేంద్రమ్మ సందర్భశుద్ధిగా కీర్తనలు గానం చేసింది. బంధు మిత్రులందరు అక్కడ చేరి 'కుటుంబం'ను సంస్మరించారు.

"Our respect for the dead, when they are just dead, is something wonderful and the way we show it more wonderful still.

—Ruskin—

ఘంటశాల ఆధ్యాత్మిక జ్ఞాన సమాజం వారు మార్చి 3 వ తేదీన కుటుంబం సంస్మరణ సభ జరిపి, దుఃఖాతిరేకంతో ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు.